18 వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
వైఎస్ఆర్ కడప
గురువారం 13 మార్చి 2025 : పేజీలు 8

# ఆశ్రమాన్ని పునర్నిర్మిస్తాం..



## కాశీనాయన ఆశ్రమ తొలగింపుపై స్పందించిన మంత్రి లోకేష్

### దేవాదాయ శాఖ ఆదీనంలోకి ఆశ్రమం : మంత్రి ఆనం

కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్

జిల్లాలోని కాశీనాయన మండలం జ్యోతిక్షేత్ర కాశీనాయన ఆశ్రమంపై ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించింది. ఆశ్రమాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి చేర్చడంతో పాటు కూల్చిన భవనాలను పునర్నిర్మిస్తామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసినందుకు క్షమించాలని, కూల్చిన అధికారులపై చర్యలు తీసుకుంటామని బుధవారం మంత్రి స్పష్టం చేశారు. కొంత కాలంగా అటవీ శాఖకు జ్యోతిక్షేత్ర నిర్వాహకులకు వివాదం సాగుతోంది. కాశీనాయన మిగతా 2పేజీలో

## నాకు భద్రతను పెంచండి

### వివేక హత్య కేసు అప్రూవర్ దస్తగిరి జిల్లా ఎస్పీకి వినతి



కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్

మాజీ మంత్రి వివేకానంద రెడ్డి కేసులో సాక్షులుగా ఉన్నటువంటి వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందుతూ వివాదాస్పదమవుతున్న విషయం తెలిసింది. దీంతో ఈ కేసులో కీలకమైన సాక్షిగా ఉంటూ అప్రూవర్‌గా మారిన ముద్దాయి దస్తగిరి బుధవారం కడప జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్‌ను కలిసేందుకు ప్రయత్నించారు. తనకు భద్రత పెంచి రక్షణ కల్పించాలంటూ వినతి పత్రం సమర్పించాలని భావించారు. అయితే ఎస్పీ మిగతా 2పేజీలో

## ఓపెన్.. బార్లు



- వైన్ షాపుల వద్ద అనధికార సిట్టింగ్ రూములు
- మద్యం కొనుగోలు.. సిట్టింగ్.. అంతా అక్కడే
- గ్లాస్, వాటర్, స్టఫ్, సిగరెట్ అన్ని అందుబాటులో..
- చూసి చూడనట్లు ఎక్సైజ్ అధికారులు
- ఫలితంగా పెరిగిన నెల వారి మామూళ్ల మొత్తం
- ఒత్తిడి చేయకుండా ప్రభుత్వం కూడా మౌనం
- బార్ల యజమానుల్లో ఆందోళన

కడప బ్యూరో - మేజర్ న్యూస్

జిల్లాలో మద్యం వ్యాపారం జోరందుకుంది. మద్యం ప్రియుల కోసం వైన్ షాపు వద్దే సర్వ సౌకర్యాలు సమకూరుస్తున్నారు. షాపుకు అనుబంధంగానే సిట్టింగ్ రూములు, గ్లాసు, వాటర్ ప్యాకెట్లు, స్టఫ్ వంటివన్నీ మద్యం దుకాణానికి అనుబంధంగానే అందుబాటులో ఉంచారు. దీంతో మద్యం తాగేందుకు వచ్చేవారు ఫుల్ ఖుషి గా ఉన్నారు. మరోవైపు నూతన మద్యం పాలసీ ఎక్సైజ్ అధికారులకు కూడా కాసుల పంట పండిస్తోంది. పర్మిట్ రూముల విషయంలో ప్రభుత్వపరంగా జాప్యం వారికి వరంగా మారింది. అనధికారికంగా పర్మిట్ (సిట్టింగ్) రూములకు సహకరిస్తూ మామూళ్లు దండుకుంటున్నారు. అధికారుల సహకారంతో సిట్టింగ్ రూములు ఇప్పటికే ఏర్పాటు చేసుకున్న మద్యం షాపుల నిర్వాహకులు పర్మిట్ రూముల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం లేదని తెలుస్తోంది. అయితే ఈ సిట్టింగ్ రూములపై బార్ల నిర్వాహకులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇలాగే కొనసాగితే బార్లు మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. 2లో

## ఎస్సీ హాస్టల్ 2 బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కి తరలించేందుకు సిద్ధం.!

వార్త 4వ పేజీలో

## బాధితులకు సత్వరం న్యాయం చేయండి

వార్త 8వ పేజీలో

## కదం తొక్కిన వైసీపీ

- కడపలో వైసీపీ నాయకు భారీ ర్యాలీ
- విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్
- అనంతరం డీఆర్వో వినతిపత్రం సమర్పణ




వార్త 2పేజీలో

## పది పరీక్షలకు పటిష్టమైన చర్యలు

### జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



వార్త 3పేజీలో

# ఆశ్రమాన్ని పునర్నిర్మిస్తా..

(మొదటి పేజీ తరువాయి)

ఆశ్రమానికి సంబంధించిన భవనాలు రిజర్వు ఫారెస్టులో స్థలంలో ఉన్నాయని, ఫలితంగా వణ్యప్రాణులకు ఇబ్బందిగా ఉందని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. గుట్టుగా పెద్ద ఎత్తున బలగాలతో వెళ్లటం ఆశ్రమంలోని భవనాలను కూల్చడం జరుగుతోంది. అందులో భాగంగానే శుక్రవారం అటవీ, రెవెన్యూ, పోలీసు అధికారులు పెద్దఎత్తున బలగాలతో వెళ్లి 20 సంవత్సరాల కిందట అనాధలకు, భక్తులకు అన్నదానం కల్పించేందుకు ఏర్పాటు చేసేందుకు నిర్మించిన భవనాలను కూల్చివేశారు. దీనిపై పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. జిల్లాతో పాటు కర్నూలు, నంద్యాల, ప్రకాశం జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు సైతం అధికారుల చర్యలను ఖండించారు. ఈ విషయాన్ని మంత్రి నారా లోకేష్ పరిశీలనకు తీసుకెళ్లారు. దీనిపై మంత్రి లోకేష్ వెంటనే స్పందించారు. అటవీ భూములు, టైగర్ జోన్ నిబంధనల కారణంగా కడప జిల్లా బద్వేలు నియోజకవర్గం, నల్లమలలోని కాశీనాయన ఆశ్రమం అన్నదాన సత్రాన్ని అటవీ శాఖ అధికారులు కూల్చివేయడం బాధాకరం. అటవీ నిబంధనలు ఉన్నా, భక్తుల మనోభావాలు గౌరవించి, అన్నదాన కార్యక్రమాలు జరిగే భవనాలను కూల్చకుండా ఉండాల్సింది. ఈ కూల్చివేతలకు ప్రభుత్వం తరఫున నేను క్షమాపణ చెబుతున్నాను. కూల్చివేతకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకుంటాం. వీలైనంత త్వరగా నా సొంత నిధులతో అదే చోట అన్నదాన సత్రం పునర్నిర్మిస్తాను.. అంటూ మంత్రి లోకేష్ ప్రకటించారు.

**దేవాదాయశాఖలోకి కాశీనాయన ఆశ్రమం..?**

కాశీనాయన ఆశ్రమంలో కూల్చివేతలపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. ఆశ్రమం అటవీ ప్రాంతంలో ఉంది. అటవీ శాఖ నిబంధనలు సంక్లిష్టంగా ఉన్నాయి. దురదృష్టవశాత్తు ఆ శాఖ అధికారులు నిర్మాణాలను కూల్చివేశారు. కాశీనాయన ఆశ్రమాన్ని దేవాదాయ శాఖలోకి తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డితో పాటు ఇతర ప్రజాప్రతినిధుల నుంచి కూడా ప్రతిపాదనలు వచ్చాయి. సీఎంతో చర్చించి మంచి నిర్ణయం తీసుకుంటాం' అని ఆనం ప్రకటించారు.

# నాకు భద్రతను పెంచండి

(మొదటి పేజీ తరువాయి)

అందుబాటులో లేకపోవడంతో తన ఫిర్యాదును కార్యాలయంలో ఇచ్చి వెనుతిరిగారు. మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్ వివేక హత్య కేసుకు సంబంధించి సాక్షులు వరుసగా చనిపోతున్నారని తనకు సెక్యూరిటీ పెంచాలని కోరడం జరిగిందన్నారు. గతంలో ఉన్న భద్రత కొనసాగించాలని విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. సాక్షుల మరణాలు వైసీపీ చేసే హత్యలా? అనుమానాస్పద మృతులా? అనేది కూటమి ప్రభుత్వం నిగ్గు తేల్చే పనిలో ఉందని తెలిపారు. కానీ ఈ యొక్క అంశాలను గమనించి నాకు కూడా ప్రాణాపాయం ఉంది కదా అని ఎస్పీని కలిసి ఆయన దృష్టికి తీసుకుని రావాలని భావిస్తున్నానని తెలిపారు. గతంలో ఏ విధంగా అయితే భద్రతను కల్పించారో అదే విధంగా ఇప్పుడు కూడా అదే భద్రతను అడుగుతున్నాను అని అన్నారు. గత ప్రభుత్వంలో టూ ప్లస్ టు భద్రతతో ఉండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వన్ ప్లస్ వన్ మాత్రం పెట్టడం జరిగిందని తెలిపారు. గతంలో ఎస్కార్ట్ 2 ప్లస్ 2 ఉండడంతో భద్రత బాగుండేది. ఇప్పుడు తగ్గిందని అన్నారు. వైసీపీ నేతల నుంచి ప్రమాదం ఉందనే ఉద్దేశంతో ఎస్పీ ని కలిసి ఫిర్యాదు ఇవ్వడం జరిగిందని అన్నారు. వివేక హత్య కేసు, సాక్షుల మరణాలు అసెంబ్లీ వరకు పోయిందని అక్కడ కూడా చర్చ జరుగుతోందని, ఈ కేసులో నేను కీలక సాక్షిగా ఉన్నందున నన్ను హతమార్చితే కేసు క్లోజ్ అవుతుందన్న ఆలోచనలో జగన్‌కు ఉన్నందున ఈ విషయాన్ని జిల్లా ఎస్పీకి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు.

## చెన్నూరులో ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



చెన్నూరు మేజర్‌న్యూస్ : వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకను ఆ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా చేశారు. ముందుగా వైసీపీ పార్టీ కార్యాలయం వద్ద ఉన్న దివంగ గత నేత వై.యస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెదబల్లి గణేష్ రెడ్డి మాట్లాడు తూ పార్టీ ఏర్పాటుకు కారణాలను వివరిస్తూ 15 ఏళ్ల పార్టీ ప్రస్థానంలో ఎన్నో విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. ప్రజల కష్టాల నుంచి వైసీపీ పుట్టు కొచ్చిందన్నారు. వైఎస్సార్సీపీకి ప్రతిపక్షంలో ఉండటం కొత్త కాదన్నారు. వైసీపీ ఎప్పుడూ అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలకు అండగా ఉంటుందని ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటుందన్నారు. తొమ్మిది నెలల కూటమి పాలన పైన ఇప్పటికే ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందన్నారు. వైసీపీ తొలి నుంచి విలువలతో రాజకీయాలు చేస్తుందని చెప్పారు. ప్రతీ కార్యకర్త తమ పార్టీ అధికారంలోకి వస్తే చెప్పిన ప్రతీ మాట నిలబెట్టుకుందని చెప్పుకునే విధంగానే పాలనా చేశారాని చెప్పు కొచ్చారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి పోరాడుతోందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటామని అలాగే వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి వచ్చేది వైసీపీ నేనని ధీమా వ్యక్తం చేశారు. ఇక పార్టీ నిర్ణయించిన విధంగా ఫీజు రీయంబర్స్ మెంట్, విద్యార్థులకు చెల్లించాల్సి బకాయిల పైన వైసీపీ నిరసనల నిర్వహణకు నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఎం పీపీ చీర్ల సురేష్ యాదవ్, ఎర్రసాని నిరంజన్ రెడ్డి, అల్లీ శ్రీరామమూర్తి, యువనాయకులు నిత్య పూజయ్య, వారిష్, గుమ్మళ్ల సాయి కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# ఓపెన్ బార్లు!

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చింది. కొత్త విధానంలో మద్యం షాపులకు అదనంగా రూ.5 లక్షల రుసుంతో పర్మిట్ రూములు కూడా అనుమతిచ్చే అంశాన్ని చేర్చారు. అయితే అమలుపై స్పష్టతను ఇవ్వలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం షాపులను ఏపీబీసీఎల్ నిర్వహించేది. కానీ సీఎం చంద్రబాబు నాయుడు మాత్రం నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రైవేటు వ్యక్తులకు మద్యం షాపులను కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా మద్యం షాపులకు ఆన్‌లైన్ వేలం ద్వారా లైసెన్స్ మంజూరు చేశారు. 2024 అక్టోబర్ 16 నుంచి ప్రైవేటు వ్యక్తులు మద్యం షాపులు నిర్వహిస్తున్నారు. అయితే ప్రభుత్వపరంగా పర్మిట్ రూముల ఊసే ఎత్తడం లేదు. బార్ల నిర్వాహకుల ఒత్తిడి కారణంగానే పర్మిట్ రూములపై ప్రభుత్వం జాప్యం చేస్తోందని మద్యం షాపుల నిర్వాహకులు మొదట ఆరోపించారు. దీంతో వ్యాపారులే రంగంలోకి దిగి అనధికారికంగా పర్మిట్(సిట్టింగ్) రూములు ఏర్పాటు చేసుకున్నారు. వీటిని చూసి చూడనట్లుగా వదిలేసేందుకు ఎక్సైజ్ అధికారులతో ఒప్పందం చేసుకొని మామూళ్లు ముట్టచెబుతున్నట్లు తెలిసింది. ప్రతి వైన్‌షాపుకు అనుబంధంగా సిట్టింగ్ రూములు ఏర్పాటు కావడంతో మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. గత నెల రోజులుగా కొనుగోళ్లు పెరిగాయి. జిల్లాలోని ఏ మద్యం దుకాణం చూసినా కళకళలాడుతోంది. వాస్తవానికి మద్యం షాపులకు పర్మిట్ రూములు మంజూరు చేస్తామని నోటిఫికేషన్ తోపాటే ప్రభుత్వం ప్రకటించింది. పర్మిట్ రూము ఏర్పాటుకు ఏటా రూ.5 లక్షలు ప్రభుత్వానికి అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వ పరంగా జాప్యం జరుగుతోంది. గత ప్రభుత్వంలో మద్యం షాపులను ప్రభుత్వమే నిర్వహించి, షాపుల్లో మద్యం మాత్రమే అమ్మకాలు జరిగేవి కాబట్టి పర్మిట్ రూములకు అవకాశం ఉండేదికాదు. దీంతో మద్యం ప్రియులు కొనుగోలు చేసి రహస్య ప్రదేశాల్లో తాగాల్సి వచ్చేది. రోడ్లు, ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు, పార్కుల్లో మద్యం సేవించే వారు. ఇది స్థానికులకు ఇబ్బందిగా మారడంతో పలు మార్లు ఘర్షణలకు కూడా దారితీసేది. పదేపదే శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో పోలీసులు కూడా కఠిన వైఖరి తీసుకునే వారు. ఈ క్రమంలోనే మొదట ప్రభుత్వం పర్మిట్ రూముల ఆలోచన తీసుకొచ్చింది.

**జిల్లా వ్యాప్తంగా సిట్టింగ్ రూములు...**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పర్మిట్ రూమ్ కావాలంటే ముందు రూ.5 లక్షలు కట్టాలి. మద్యం వ్యాపారం అంతంత మాత్రంగా ఉండేది. భారీ స్థాయిలో ఆశించిన వ్యాపారులకు ఆ స్థాయిలో ఆదాయం లేదు. ప్రభుత్వం ఇచ్చే కమీషన్‌తో లాభాలు పొందడం కష్టమని భావించిన వ్యాపారులు తమ నష్టాన్ని పూడ్చుకునేందుకు, మద్యం ప్రియులను ఆకర్షించేందుకు అనధికారికంగానే సిట్టింగ్ రూములు ఏర్పాటు చేసుకున్నారు. అధికారుల నుంచి పెద్దగా ఒత్తిళ్లు లేకపోవడంతో జిల్లాలోని వ్యాపారులందరూ వైన్‌షాప్‌లకు అనుబంధంగానే ప్రత్యేక రూములు ఏర్పాటు చేశారు. షాపులకు ఆనుకుని లేదా ఆదేకాంప్లెక్సులో డిస్పోజల్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు, మందులోకి స్టఫ్ (చికెన్, మటన్, పల్లి, చిప్స్, వంటివి), గుట్కా, సిగరెట్ వంటివి అమ్మకాలు చేయిస్తున్నారు. జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల, బద్వేల్, కమలాపురం వంటి పట్టణ ప్రాంతాలతో పాటు మండల కేంద్రాల్లో కూడా వైన్ షాప్ అనుబంధంగా అనధికార సిట్టింగ్ రూములు ఏర్పాటు అయ్యాయి. దీంతో వైన్ షాపులు కళకళలాడుతున్నాయి. మద్యం ప్రియుల నుంచి కొనుగోలు పెరిగాయి. దుకాణంలో మందు తీసుకోవడం.. పక్కనే తాగేందుకు వసతులు ఉండటంతో కొనుగోలుదారులు బార్లకు వెళ్లడం కంటే వైన్ షాపులకే వెళ్లేందుకు మొగ్గు చెబుతున్నారు. అనధికారికంగా ఏర్పాటైన సిట్టింగ్‌లు రూములు, ఏర్పాట్లపై ఎక్సైజ్ అధికారులు కూడా ఉదాసీనంగానే చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి కూడా ఒత్తిడి లేకపోవడం, వ్యాపారులు ఇచ్చే ముడుపుల పెంచుకునేందుకు అవకాశం కలగడంతో దీనిపై ఎక్సైజ్ అధికారులు ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదు. మద్యం దుకాణం నిర్వాహకులు కూడా ఇప్పటికిప్పుడు రూ.5 లక్షలు పెట్టాల్సిన అవసరం ఏముందనేది వీరి అభిప్రాయం. ఎలాగూ అధికారులకు మామూళ్లు ఇవ్వాల్సిందే. ఆ ఇచ్చేదేదో కొంతపెంచి ఇస్తే సరిపోతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. మద్యం షాపుల నుంచి పోలీసులకు నెలవారీ మామూళ్లతో పాటు రోజువారీ బీటు ఇస్తారనే వాదన ఉంది. కాబట్టి వారు కూడా పట్టించుకునే పరిస్థితి లేదు. ఇంతటి సానుకూల పరిస్థితుల్లో ప్రత్యేకంగా అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేకుండానే జిల్లా వ్యాప్తంగా అనధికారిక సిట్టింగ్ రూములు ఏర్పాటు అయ్యాయి. అయితే వీటిపట్ల బార్ల నిర్వాహకులు మాత్రం మండిపడుతున్నారు. బార్లకు వచ్చే వారి సంఖ్య క్రమంగా తగ్గుతోందని వారు చెబుతున్నారు. ఇప్పటికే ప్రీమియం మద్యం పేరుతో ప్రభుత్వం తక్కువ ధరకే మద్యం విక్రయిస్తోంది. ప్రముఖ బ్రాండ్ల కంపెనీలు సైతం ధరలను తగ్గించాయి. దీంతో బార్లలో కూడా ధరలను తగ్గించాల్సి వచ్చింది. ఇప్పటికే బార్లకు వచ్చేందుకు విముఖత చూపుతున్న మద్యం ప్రియులకు ప్రస్తుతం షాపుల వద్ద అనధికార పర్మిట్ రూములు కొనసాగితే తాము బార్లను నిర్వహించలేమని యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ జిల్లావ్యాప్తంగా మద్యం దుకాణాల్లో సిట్టింగ్ రూములు మూడు పువ్వులు ఆరుకాయలు అన్నట్లు సాగుతున్నాయి.



# కదం తొక్కిన వైసీపీ



కడప ఎడ్యుకేషన్ - మేజర్‌న్యూస్ : వైసీపీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు కడప జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యువత పోరు(ఫీజు రీయింబర్స్మెంట్)లో ఆపార్టీ శ్రేణులు కదం తొక్కారు. బుధవారం ఆ పార్టీ కార్యాలయం నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వైసీపీ నాయకులు వేలాదిగా తరలి వెళ్లి కలెక్టర్ కు ఫీజు రీయింబర్స్మెంట్ ప్రభుత్వం చెల్లించాలని వినతి పత్రం అందజేశారు. 10 నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోందని నేతలు విమర్శించారు. వైఎస్ఆర్సిపి అధిష్ఠానం పిలుపు మేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యువత పోరు కార్యక్రమం కడప నగరంలో భారీగా నిర్వహించారు. మొదట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ ఆఫీసు నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం ఎస్. బి.అంజాద్ భాష, కడప పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, మేయర్ సురేష్ బాబు, బద్వేల్ ఎమ్మెల్యే దాసరి సుధా, ఎమ్మెల్సీలు డిసి గోవింద్ రెడ్డి, రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రఘురామి రెడ్డి, రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, సుధీర్ రెడ్డి, కమలాపురం ఇన్చార్జ్ నరేన్ రామాంజనేయరెడ్డి, జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు దేవి రెడ్డి ఆదిత్య, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు గురు సాయి దత్త, నగర యువజన విభాగం అధ్యక్షుడు గుంటి నాగేంద్ర, విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు శివారెడ్డి, వైయస్ఆర్ సీపీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, జిల్లా స్టూడెంట్ యూనియన్ , పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, వైయస్ఆర్ సీపీ నాయకులు , కార్యకర్తలు, ప్రజలు ,పాల్గొన్నారు. అనంతరం ఎస్.బి.అంజాద్ భాష మాట్లాడుతూ.. పేద విద్యార్థులు వైఎస్ఆర్ ఫీజు రీయింబర్స్ మెంట్ అందించారు. అదే విధంగా వైఎస్ జగన్ 90 శాతం మందికి ఫీజు రీయింబర్స్మెంట్, విద్య దీవెన, వసతి దీవెన అందించారు. అయితే ప్రస్తుతం 5వ త్రైమాసికం జరుగుతున్నా ఫీజు రీయింబర్స్మెంట్ ను ఈ ప్రభుత్వం చెల్లించడం లేదు. అదేవిధంగా రూ.7200 కోట్ల మేర ఇప్పటి వరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఫీజులు చెల్లించక, భృతి ఇవ్వకపోవడంతో విద్యార్థులు, యువత కూలీపనులకు వెళ్ళవలసిన పరిస్థితి నెలకొందని అంజాద్ భాష ఆరోపించారు. అనంతరం వైసీపీ నేతలు మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ కు వెన్నుపోటు పొడిచారు. అప్పట్లో మద్యపాన నిషేధం కు తూట్లు పొడిచాడు. ఈరోజు విద్యార్థులను నిలువునా మోసం చేశాడని వారు ఆరోపించారు. 2014 లో కూడా ఎలాంటి హామీలు అమలు చేయలేదు. జగనన్న విద్య దీవెన, వసతి దీవెన కింద రూ. 18వేల కోట్లు జగనన్న ఖర్చు చేశారు. నేడు అమ్మఒడి లేదు, విద్యా దీవెన లేదు, టోఫెల్ లేదు, సీబీఎస్.ఈ లేదు, బైజ్యూస్ కంటెంట్ లేదు. పేద విద్యార్థులు జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆటలు ఆడుతోంది. 17 మెడికల్ కాలేజీ లు రాష్ట్రానికి తీసుకు వచ్చిన ఘనత వైఎస్ జగన్ ది. ఆ మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేయాలని చంద్రబాబు చూస్తున్నారని వైసీపీ నేతలు మండిపడ్డారు. ప్రభుత్వం ఆధీనంలోనే మెడికల్ కాలేజీలు నిర్వహణ ఉండాలని వారు డిమాండ్ చేశారు. ఇంత దారుణమైన పాలన ఎప్పుడు చూడలేదు. సూపర్ సిక్స్ హామీలు గాలికి కలిసి పోయాయి. రాజధాని నిర్మాణం ఒక్కటే చేస్తాను అంటే కాదు, ప్రజలకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ప్రతినిధిగా డీఆర్వో విశ్వేశ్వర్ నాయుడుకు వినతి పత్రం సమర్పించారు.

# ఎస్సీ హాస్టల్ 2 బియ్యాన్ని బ్లాక్ మార్కెట్ కి తరలించేందుకు సిద్ధం.!

విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘం నాయకులు – ప్లేట్ ఫిరాయించిన వార్డెన్ హరికృష్ణ.

రాత్రి సమయంలో బ్లాక్ మార్కెటు తరలి వెళ్ళిన బియ్యం ఎవరివి – హాస్టల్లో మెనూ షీట్ కనబడిన వైనం.





**బద్వేల్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వాలు అనుగారిన వర్గాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక భారముతోవిద్యను అభ్యసించక ఇబ్బందులు పడుతున్న విషయాలను గుర్తించి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వేచించి వారి విద్య అభ్యున్నతికై ప్రభుత్వ హాస్టల్లో ఏర్పాటు చేసి వారికి అన్ని విధాల సకల సదుపాయాలు ఏర్పాటు చేసి అందిస్తున్నప్పటికీ వాటిని విద్యార్థులకు ఆరో కొర్ సదుపాయాలు కల్పించడమే గాక వారికి భోజన వసతి కోసం విడుదల చేసిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా బ్లాక్ మార్కెట్కు తరలిస్తూ విద్యార్థుల నోరు కోరుతున్నారంటూ పలువురు విద్యాసంఘాలు నాయకులు ఆరోపిస్తున్నారు.బద్వేలు మున్సిపాలిటీ ఎస్సీ బాయ్స్ హాస్టల్ 2 లో అధికారులు సరఫరా చేసిన బియ్యం బ్లాక్ మార్కెట్ తరలించేందుకు ప్రయత్నిస్తున్న విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘం నాయకులు అక్కడికి చేరుకోవడంతో హాస్టల్ వార్డెన్ ప్లేట్ కిరాయించాడు. ఎస్సీ బాయ్స్ హాస్టల్ 2 వార్డెన్ గా హరికృష్ణ విధులు నిర్వహిస్తున్నాడు హాస్టల్‌కు సంబంధించిన రేషన్ బియ్యాన్ని స్టోర్ రూమ్‌లో భద్రపరచకుండా అక్రమంగా రవాణా చేసేందుకు దాదాపుగా 35 బస్తాలను వేరే రూములులో నిల్వ చేశారని అంతే కాకుండా సోమవారం రోజున ఆ హాస్టల్ భవనం నుంచి రాత్రి ఆటో ద్వారా బ్లాక్ మార్కెట్‌కు బియ్యాన్ని తరలించారని ఆరోపణలు రావడంతో విద్యార్థి సంఘాల నాయకులు కాపు కాశారు. కానీ వారి కళ్ళు కప్పి బ్లాక్ మార్కెట్కు గుట్టు చప్పుడు కాకుండా విద్యార్థులకు సంబంధించిన రేషన్ బియ్యం అదేతరుణంలో మరల బ్లాక్ మార్కెటు బియ్యం తరలించేందుకు సిద్ధపడడంతో విషయం తెలుసుకున్న ప్రజాసంఘాలు హాస్టల్ కి వెళ్లి పరిశీలించగా స్టోర్ రూమ్‌లో ఉండవలసిన బియ్యం వేరొక రూములో దాదాపుగా 35 బస్తాలు నిల్వచేయడం పట్ల విద్యార్థి సంఘం నాయకులు వార్డెను నిలదీయడంతో నేను లేనప్పుడు స్టోర్ రూమ్‌లో కాకుండా వేరే రూములో సిబ్బంది దించారని కొత్త నాటకానికి తెరలేపాడు అంతేకాకుండా మరియొక్క హాస్టల్‌కు సంబంధించిన బియ్యాన్ని మా హాస్టల్ నందు దించి వెళ్లారని అక్కడికి వెళ్లిన విలేకరులకు విద్యార్థి సంఘాల నాయకులకు కహానీలు చెప్పాడు. దాదాపుగా పదవ తరగతి చదివే విద్యార్థులు రిజిస్టర్లో నమోదు చేసిన విద్యార్థుల సంఖ్య దాదాపుగా 90 మంది ఉండగా హాస్టల్లో 20 మంది విద్యార్థులు మాత్రమే ఉండడం పట్ల విద్యార్థులు లేకుండానే ఉన్నట్టు రిజిస్టర్లలో నమోదు చేసుకొని విద్యార్థుల కొరకు పంపిణీ చేసిన రేషన్ బియ్యాన్ని గుర్తు చప్పుడు కాకుండా తరలిస్తున్నారని వార్డెన్ నీ విద్యార్థి సంఘం నాయకులు విలేకరులు పడక ఆయన పొంతన లేని సమాధానాలు చెప్పడం విశేషం. సోషల్ మీడియాలో హల్చల్ కావడంతో సంబదిత అధికారి ఏ ఎస్ డబ్ల్యూఓ హాస్టల్ వచ్చి రికార్డులు తనిఖీ చేసి వెళ్లారు తనిఖీల్లో హాస్టల్లో రికార్డులలోఉండవలసిన బియ్యం బస్తాల కంటే అదనంగా దాదాపుగా ఐదారు బస్తాలు ఎక్కువగా తనిఖీకి వచ్చిన అధికారి ఏ మాత్రం పట్టించుకోకుండా వెళ్లిపోవడం అంతర్యం ఏమిటి అని పలువురు చుట్టుపక్కల ప్రజలు విమర్శిస్తున్నారు. స్టోర్ రూంలోఉండాల్సిన బియ్యం 65 బస్తాలు ఉండవలసివుంటే స్టోర్ రూములో 35 బస్తాలను నుంచి మరొక రూంలో 30 బస్తాలు ఎందుకు ఉన్నాయనివిద్యార్థి సంఘాల నాయకులు వార్డెన్ హరికృష్ణ నిలదీయడముతో పొంతన లేని సమాధానాలు చెప్పాడు.విషయం తెలుసుకున్న మరో హాస్టల్ కిచెందిన వార్డెన్ రంగప్రవేశం చేసిఎస్సీ హాస్టల్‌లో విద్యార్థి సంఘాలతో రాయబారం చేసి రాజీమార్గాన పంపినట్లు విశ్వసనీయ సమాచారం.విషయం ఉన్నతాధి కారులకు తెలియడంతో మరో రూమ్ నుండి స్టోర్ రూమ్ లోకి రేషన్ బియ్యం నిల్వ చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విచారణ చేయబడితే బ్లాక్ మార్కెట్‌కి వెళ్ళిన బియ్యం కథ తెలిసిపోతుందని పలువురు స్థానికులు కోరుకుంటున్నారు.

# భారతంలో జీవిత పాఠాలు ఎన్నో ఉన్నాయి



బ్రహ్మంగారిమఠం, మేజర్‌న్యూస్ : భారతంలో ధర్మం రాజకీయ ఎత్తుగడలో కాక జీవిత పాఠాలు ఎన్నో ఉన్నాయి చాపాడు వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ కడప వారి ఆధ్వర్యంలో మండలంలోని గంగిరెడ్డి పల్లె రామాలయంలో జరిగిన ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా రెండవ రోజు మహాభారతం అనే అంశంపై ఆయన ప్రసంగించారు.ఈ ఆయన మాట్లాడుతూ మహాభారతంలో పాండవుల ఉత్తమ చరిత్ర కౌరవుల ఇతివృత్తం చక్కగా ఆవిష్కరించబడ్డాయి భారతీయ విజ్ఞాన సర్వ స్వంగా భారతం ప్రసిద్ధి పొందిందన్నారు. ఈ కార్యక్రమం ధర్మ ప్రచార పరిషత్ కడప ప్రోగ్రాం అసిస్టెంట్ గోపి బాబు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల వీరారెడ్డి చిన్న ఓబుల్ రెడ్డి రామకృష్ణారెడ్డి రమణారెడ్డి నరసింహారెడ్డి లక్ష్మీదేవి వరలక్ష్మి ,సావిత్రి ,సరోజమ్మ, అర్చకుడు సుబ్బారావు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మూడు నాలుగు ఐదు తరగతుల విలీనాన్ని ఆపాలి

ఉపాధ్యాయ సంఘాల డిమాండ్.



**చెన్నూరు, మేజర్‌న్యూస్:** చెన్నూరు క్లస్టర్ కాంప్లెక్స్ అనంతరం మూడు, నాలుగు, ఐదు తరగతుల విలీనాన్ని ఆపాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు లక్ష్మీరాజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో మోడల్ ప్రైమరీ స్కూల్ వ్యవస్థ తీసుకురావటం నేపథ్యంలో పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ అని చెప్పిన ప్రభుత్వం అది మరచి రాష్ట్రంలో సగం పంచాయతీలలో మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు చేయడానికి అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోందని అలాగే ఆ మాటలు ప్రైమరీ స్కూలుకు ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న అన్ని ప్రాథమిక పాఠశాలలో ఉన్న మూడు, నాలుగు, ఐదు తరగతులను మోడల్ ప్రైమరీ స్కూల్లో విలీనం చేయటానికి వేగవంతంగా అడుగులు ముందుకు వేస్తా ఉందన్నారు.ఈ విధానం వలన ప్రాథమిక విద్యావ్యవస్థ ఇబ్బందికరంగా మారుతుందని.మేము జీవో 117 రద్దు చేయమని కోరింది నిజమే మా ఉద్దేశం ఎక్కడి నుంచి మూడు,నాలుగు,ఐదు తరగతులను సమీపంలోని హైస్కూల్లో కలిపారో ఆ మూడు నాలుగు ఐదు తరగతులు యధావిధిగా పాత పాఠశాలలో విలీనం చేయాలనేది మా ఉద్దేశమన్నారు.అలాకాకుండా మొత్తం ప్రాథమిక విద్యారంగా వినాశకర విధానాలు వలన ఉద్యమాలు చేపట్టవలసి వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు వెంకటసుబ్బయ్య,బాబురెడ్డి, వీరనారాయణ, శ్రీనివాసులు, వెంకటేశ్వర రెడ్డి, మధుసూదన్, సుబ్బరాయుడు, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా నారాయణ నృసింహ గాయత్రి హోమం

మూడవరోజు శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో – పుత్తా కుటుంబ సభ్యులు..



**వల్లూరు,మేజర్‌న్యూస్ :** ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు, వైభవంగా నారాయణ నృసింహ గాయత్రి హోమం, మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను మూడవరోజు ఘనంగా నిర్వహించారు, ఆలయ వ్యవస్థాపకులు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సతీమణి సరళమ్మ, కమలాపురం శాసనసభ్యుడు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి సతీమణి చైతన్య రెడ్డి, పుత్తా రామచంద్రారెడ్డి దంపతులతో పాటు, యువ నాయకుడు పుత్తా సాయి నరసింహారెడ్డి లు గాయత్రి హోమంలో పాల్గొన్నారు,బుధవారం తెల్లవారుజామున నుండి ఆలయంలో చతుఃస్థానార్చన, అయుత నారాయణ అష్టాక్షరీ హోమము, నృసింహ మూలమన్త్ర జపము, హోమము, నృసింహ గాయత్రీ, నృసింహానుష్టుప్ మన్త్రహోమము, నృసింహ మన్త్రరాజపదస్తోత్ర హోమము, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీసహస్ర నామ కుంకుమార్చన, చతుఃస్థానార్చ, అష్టోత్తర శతవార శ్రీ సూక్త హోమము. తత్త్వ హోమము, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. రాత్రి రంగస్థల పద్యముల పోటీలు ప్రదర్శించారు, భక్తులు పాల్గొని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కృపకు పాత్రులయ్యారు..

# గుత్త హక్కులను బహిరంగ వేలం

**మైదుకూరు, మేజర్‌న్యూస్:** మైదుకూరు పురపాలక సంఘంలోని బస్టాండు గేటునకు, దినసరికూరగాయల మార్కెట్టునకు సంబంధించి 2025–26 సంవత్సరమునకు 12 నెలల ఫీజులు వసూలు చేసుకొనుటకు గుత్త హక్కులను టెండరు–కం–బహిరంగ వేలం ద్వారా కేటాయించబడును. కావున వేలం పాటను గురువారము, ఉదయం 11.00 గంటలకు మైదుకూరు పురపాలక సంఘం కమీషనరు ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. కమీషనరు, మైదుకూరు పురపాలక సంఘము పేరు మీద దినసరి కూరగాయల మార్కెటుకు రూ. 2,00,000, బస్టాండు గేటుకు రూ. 1,00,000 లు డి.డి.ని యస్.బి.ఐ, గాని ఏ ఇతర మైదుకూరు బ్యాం కుల నందు చెల్లుబాటు అగునట్లు, మండల రెవిన్యూ అధికారిగారితో జారీ చేయబడిన సాల్వే న్సీ పత్రము దినసరి కూరగాయల మార్కెటుకు సాల్వేన్సీ పత్రము రూ. 3,00,000, బస్టాండు గేటుకు రూ. 2,00,000లకు సాల్వేన్సీ పత్రము జతపరచి, వేలం పాటకు ఒక రోజు ముందు మునిసిపల్ ఆఫీసు నందు సమర్పించి రశీదు, టెండరు ఫారము పొందుటకు తగిన మొత్త మును ఆఫీసు ట్రెజరీ నందు చెల్లించి టెండరు ఫారంను పొందవలెను. వేలం పాట గురువారం మునిసిపల్ కార్యాలయం ఆవరణములో నిర్వహిస్తామని మైదుకూరు మునిసిపల్ కమీషనరు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి : సి.ఐ.,ఎస్.ఐ.



కమలాపురం మేజర్ న్యూస్ మండల పరిధిలో ఉన్న ఆటోలు ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించకుండా తిరగాలని సిఐ రోషన్ ఎస్ఐ ప్రతాప్ రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్ అవగాహన కల్పించి తగు సూచనలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి మీ గమ్యాన్ని సురక్షితముగా చేరాలన్నారు. అతివేగముగా వెళ్లి ప్రాణాలు పోగొట్టుకోవద్దన్నారు. మైనర్లకు ఆటోలు ఇస్తే ఓనర్లపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. సర్కిల్ ఉన్న ప్రాంతాలలో ఆటోలను ఎక్కడపడితే అక్కడ నిలపరాదన్నారు. చాలామంది ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ ఇబ్బంది కలిగిస్తున్నారని అలా చేస్తే చర్యలు తప్పవు అన్నారు. అడ్డ రోడ్డు ప్రాంతంలో ఆటోలు నడిపేప్పుడు ప్రయాణికులను ఎక్కించిన సమయంలో వాహనాల ముందు సభ్యుడు వెళ్లి వాహనం నిలపవద్దని అలా చేయడం వలన ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. పత్తి ఆటోకు పోలీస్ స్టేషన్ ఇచ్చిన నెంబర్లను ఉంచాలని ఆటో లు నడిపే సమయంలో అధిక సౌండ్ ఉపయోగిస్తున్నారని అది చాలా తప్పు అని అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం




**అట్లూరు, మేజర్ న్యూస్:** అట్లూరు మండల టిడిపి యువ నాయకుడు పాలకొండు రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బద్వేలు – కడప ప్రధాన రహదారిలో బుధవారం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని స్థానిక టిడిపి నాయకుడు జెసిబి సుబ్బారెడ్డి, అట్లూరు మండల ఎంపీడీవో భాస్కర్ బాబు ప్రారంభించారు ఈ సందర్భంగా ఎంపీడీవో భాస్కర్ బాబు మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన పాలకొండు రాజశేఖర్ రెడ్డికి అభినందనలు తెలిపారు చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు

## మాజీ డాక్టర్ ఎమ్మెల్యే మూలే సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలు



జమ్మలమడుగు మేజర్ న్యూస్:మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు జమ్మలమడుగు పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జమ్మలమడుగు పట్టణంలోని పొద్దుటూరు రోడ్డు నందు గల గాయత్రి వృద్ధాశ్రమం మరియు నాగలకట్ట లోని స్వాతి సోషల్ వెల్ఫేర్ సొసైటీ నందు వృద్ధులకు నిరాశ్రయులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దూదేకుల పెద్ద కులాయప్ప ఆధ్వర్యంలో భోజనం వసతి మరియు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా దూదేకుల పెద్ద కులాయప్ప మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి నిండు నూరేళ్ల సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. జమ్మలమడుగు నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, తనదైన ముద్ర వేసుకున్న మాజీ డాక్టర్ సుధీర్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దూదేకుల అబ్దుల్ ఖాదర్, సుధాకర్, అన్సర్, గిరి, సుభహాన్, నాని, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలను విలీనం ఆపండి : ఎస్‌టియు



పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలలను కనుమరుగు చేసేందుకు తరగతుల విలీన ప్రక్రియను విరమించకపోతే ఉద్యమాన్ని చేపడుతామని పోరుమామిళ్ల మండల ఎస్ టి యు నాయకులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్టియు మండల అధ్యక్ష, ప్రధాన, ఆర్థిక కార్యదర్శులు పుల్లయ్య, జయరాం రెడ్డి, భాష లు సంయుక్తంగా మాట్లాడుతూ పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఆమోదం మరియు ఉపాధ్యాయుల సూచనలు తీసుకొని విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకు రావాలన్నారు. అలా కాకుండా సొంత నిర్ణయాలతో పాఠశాలలను విలీనం చేస్తే పేద, బడుగు, బల హీనవర్గాల విద్యార్థులకు విద్య దూరం అవుతుం దన్నారు. 50 మంది విద్యార్థులు ఉన్న ప్రతి పాఠశాలను మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్పు చేసి, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించాలన్నారు. అలా కాకుండా మొండిగా వ్యవహరిస్తే ఉద్యమబాట చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సోదర సంఘ నాయకులు చెన్నయ్య, నాయిబ్ రసూల్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అరటికాయల లారీ బోల్తా




పులివెందుల మేజర్ న్యూస్: పులివెందుల మండల పరిధి లోని నల్లగొండ వారి పల్లె సమీపాన అరటికాయల ఫుల్ లోడ్ లారీ టస్కర్ బండి వాహ నం అదుపు తప్పి బోల్టో పడింది ప్రమాదవశాత్తు బండి లో కూలోల్లు లేక పెద్ద ప్రమా దం తప్పింది. కూలోళ్ల ను దింపి కాటా వేసుకొని వస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది డ్రైవర్‌కు క్లీనర్‌కు స్వల్పంగా గాయాలు తగిలినట్టు తెలుస్తుంది. పులివెందుల నుండి ముదిగుబ్బ మీదుగా వెళుతుండ గా ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తుంది. ప్రాణనష్టం జరగక పోవ డంతో ఊపిరి పీల్చుకున్నారు. 4:00 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తుంది.

## బ్లడ్ బ్యాంకులు ఆకస్మిక తనిఖీ

### రికార్డులు పరిశీలించిన జిల్లా వైద్య శాఖ అధికారులు



కడప ప్రతినిధి – మేజర్ న్యూస్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు, జిల్లా లెప్రసి, ఎయిడ్స్ అండ్ టీ.బి. విభాగ అధికారి డాక్టర్ రవి బాబు సంయుక్తంగా కడప నగరములో ఉన్న రేడ్ క్రాస్ బ్లడ్ సెంటర్, బ్రుహద బ్లడ్ సెంటర్, భోగా పార్వతమ్మ బ్లడ్ సెంటర్ లు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లోని రిజిస్టర్స్ అన్ని పరిశీలించారు. పేషంట్ నుండి ఎంత పేమెంట్ తీసుకుంటున్నారు అనే విషయాలను, పేషెంట్ రిక్విజేషన్ ఫామ్ ఉచితంగా తీసుకున్నా వారికి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకోన్నారు. దీనిలో భాగంగా పేషంట్ పేమెంట్ రిసిప్ట్, ఇష్యూ రిజిస్టర్స్ సక్రమంగా ఉన్నాయని తెలిపారు. బ్లడ్ బ్యాంకులో ఉన్న పేషెంట్ రిక్విజేషన్ ఫామ్, బ్లడ్ స్టాక్ రిజిస్టర్, డోనర్ రికార్డ్, క్యాంప్ రిజిస్టర్స్, క్రాస్ మ్యాచింగ్, డిస్కార్డ్ రిజిస్టర్, బ్లడ్ ఇష్యూ రిజిస్టర్, పేషెంట్ రిసీవ్డ్ మరియు ఫిజికల్ గా బ్లడ్ స్టాక్ ని పరిశిలించారు. రక్తదాన శిబిరాల ద్వారా సేకరించిన రక్తములో గవర్నమెంటు బ్లడ్ బ్యాంక్ కు ఇచ్చిన 30 శాతం బ్లడ్ క్యాంప్ రికార్డు ని, మంత్లీ డోనర్స్ అండ్ మంత్లీ ఇష్యూ రిజిస్టర్, బ్లడ్ కలెక్షన్ రూమ్, క్రాస్ మ్యాచింగ్ రూమ్, కాంపోనెంట్ ప్రిపరేషన్ రూమ్, వైరల్ స్క్రీనింగ్ రూమ్, పరిశీలించడం జరిగినది. అలాగే రక్తదాన శిబిరాల నిర్వహణా ఎక్కువ చేయాలని, అందులో సేకరించినా వాటిలో 30 శాతం ప్రభుత్వ బ్లడ్ బ్యాంకు ఇవ్వాలని , లేని పక్షములో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు గారు హెచ్చరించారు. ఈ కార్యక్రమములో ఏపీ సాక్స్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఎల్. అలీ హైదర్ , ఎపిడమలజిస్ట్ యస్ .ఖాజా పాల్గోన్నారు.

## ఘనంగా వైఎస్ఆర్సిపి 15వ ఆవిర్భావ దినోత్సవం



పులివెందుల మేజర్ న్యూస్ పులివెందులలో పార్టీ కార్యాలయంలో బుధవారం వైయస్సార్సీపి 15వఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో ముందుగా వైసిపి జెండా ఎగరవేసే అనంతరం కేకు కటింగ్ వైఎస్ఆర్సిపి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది పులివెందుల పట్టణ మున్సిపల్ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకుడు వేంపల్లి సతీష్ రెడ్డి పులివెందుల మున్సిపల్ చైర్మన్ వల్లేపు వరప్రసాద్ ఎక్స్ మార్కెట్ యార్డ్ చైర్మన్ గూడూరు చిన్నప్ప పులివెందుల పట్టణ ప్రెసిడెంట్ హాల్ గంగాధర్ రెడ్డి పులివెందుల తాలూకా మండల కన్వీనర్లు కౌన్సిలర్లు మహిళా కౌన్సిలర్లు వైయస్సార్సీపి నాయకులు పాల్గొని కడపలో తలపెట్టిన యువత పోరు కలెక్టరేట్ ఆఫీస్ దగ్గర నిరసన కార్యక్రమానికి అన్ని మండలాల కన్వీనర్లు వైఎస్ఆర్సిపి పార్టీ ముఖ్య నాయకులు ప్రజలు యువత కార్యకర్తలు కడపకు వెళ్లి పాల్గొనడం జరిగినది. వైసీపీ నాయకులు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రజల కష్టాలను దివంగతనేత శ్రీ డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయుడిగా ఆ మహానేత వేసిన బాటలో నడిచి, ప్రజల కష్టాలను పాదయాత్రతో కని,విని “నేను విన్నాను, నేనున్నాను” అని ప్రజలకు భరోసా కల్పిస్తూ, ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా మొదలు పెట్టిన వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, 2019లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రోజు నుండి ప్రజా సంక్షేమం–అభివృద్ధి, స్త్రీ సమానత్వం, రైతు సంక్షేమం, విద్యార్థుల భవిష్య త్తుకై అహర్నిశలు తపించి, గ్రామ స్వరాజ్యాన్ని నెలకొల్పి దేశంలోనే మన రాష్ట్రాని ఆదర్శంగా నిలిపిన మన జననేత జగనన్న నాయకత్వంలో 14 వసంతాలు పూర్తి చేసుకుని 15వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా, పార్టీ శ్రేణులందరికీ వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు. కార్యక్రమంలో వేల్పుల రామలింగారెడ్డి జిల్లా బూత్ కన్వీనర్ చంద్రమౌళి కోఆప్షన్ మెంబర్ చంద్రమౌళి నగరగుట్ట నాయకుడు పద్మనాభరెడ్డి ఇనుముల కిట్ట నత్తి రవి ఆర్ బి డాక్టర్స్ పాపయ్య, కౌన్సిలర్ కోడి రమణ, వెంకట శివ, సోషల్ మీడియా జహీర్, నజీర్, భద్ర మధు, నరసారెడ్డి పాల్గొన్నారు

## జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

వేంపల్లె మేజర్ న్యూస్: ఈ నెల 14 వ తేదీ పీఠాపురంలో జరుగు జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ పులివెందుల నియోజకవర్గ సీనియర్ నేత డా దాసరి రవిశంకర్ ఆద్వర్యంలో బుధవారం స్థానిక వేంపల్లి పట్టణంలోని తన కార్యాలయంలో చలో పీఠాపురం అనే పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు అందరూ కలిసి రావాలని పిలుపు నిచ్చారు. తమ పార్టీ అధినేత, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కడప, అన్నమయ్య జిల్లాల జనసైనికులు భారీగా తరలివాలని కోరారు. పీఠాపురం వచ్చేవారు తమను సెల్ ఫోన్ ద్వారా సంప్రదించాలి కోరారు. పులివెందుల




నియోజ కవర్గం నుంచి పెద్ద ఎత్తున పాల్గొనాలని రవిశంకర్ కోరారు ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు నాగ మల్లికార్జున, మహబూబ్ బాషా, సాయి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్య కిట్లను పంపిణీ



వేముల మేజర్ న్యూస్::ఁ వేముల మండలం లోని స్థానిక మబ్బుచింతలపల్లె గ్రామంలో ఉన్నఎంపీపీ స్కూల్ నందు యురేనియం ప్రాజెక్ట్ లోని ఏస్ యం యస్ కంపెనీ ఆద్వర్యంలో పాఠశాలకు కుర్చీలు, విద్యార్థులకు పుస్తకాలు, వ్రైటింగ్ ప్యాడ్స్ లు, పెన్సిల్ బాక్స్‌లు, కంపాస్ బాక్స్‌లు, స్కేల్ లు , మ్యాపులు, సైన్స్‌చార్ట్‌లు మొదలగువిద్యాసామగ్రిని స్కూల్ హెడ్ మాస్టర్ రామాంజులరెడ్డి, టీచర్ చంద్ర శేఖర్ రెడ్డి సమక్షంలో విద్యార్థులకు ఏస్ యం యస్ కంపెనీ సి వి ఓ ఖలీల్ సౌదాగర్ అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా ఖలీల్ సౌదాగర్ మాట్లాడుతూ పిల్లలు రోజు క్రమం తప్పకుండ బడికి రావాలని, శ్రద్ధగా చదువుకొని గవర్నమెంటు స్కూల్ పిల్లలు ప్రైవేట్ స్కూల్ పిల్లలకు ధీటుగా రాణించాలని వారు ఆకాంక్షించారు. ఏస్ యం యస్ కంపెనీ స్కూల్ లోని బడి పిల్లలకు చదువు చెప్పడానికి ప్రత్యేకముగా సుజాత (ఎంసిఎ)ను నియమించడం జరిగింది అని అన్నారు. పాఠశాల హెడ్ మాస్టర్ ఆద్వర్యంలో స్కూల్ తరపున ఖలీల్ సౌదాగర్, డిజి యంసురేష్ బాబుకి కృత్ఞతలు తెలియజేశారు. కార్యక్రమం లో కంపెనీ సిబ్బంది సురేష్ రెడ్డి,పవన్ రెడ్డి ఉన్నారు.

## లింగాల హైస్కూలుకు వాటర్ కూలర్ వితరణ



లింగాల మేజర్ న్యూస్ లింగాల మండలకేంద్రంలోని ఎగువ లింగా ల జిల్లాపరిషత్ హైస్కూ ల్లో 1997 –98 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన విద్యార్థులు కొన్ని రోజుల క్రిందట పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేసి, అకాల మరణం చెందిన తమ స్నేహితుడు గురుప్రసాద్ కుటుంబానికి లక్ష రూపాయలు, పాఠశాలకు వాటర్‌కూలర్‌ను సమకూర్చు తామని గతంలో ఇచ్చిన హామీమేరకు, నేడు తోటివిద్యార్థుల సహకారంతో పాఠశాలకు వాటర్ కూలర్‌ను అందజేయడం జరిగింది. ఈసందర్భంగా వారి సేవాతత్పరతను పలువురు అభినందించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, దివ్యాంగుల విద్యా సహాయకులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, ఉపాధ్యాయులు రమేష్‌రెడ్డి, కృష్ణ మోహన్, సురేష్ రెడ్డి, పాఠశాల సిబ్బంది బాబయ్య, షరీఫ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు

సూర్య www.suryaa.com
KADAPA కడప జిల్లా
గురువారం 13 మార్చి 2025

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఉమాదేవి



పులివెందుల మేజర్ న్యూస్ పులివెందుల పట్టణం శిల్పారామంలో నందిరెడ్డి గారి లక్ష్మి నారాయణ రెడ్డి కుమారుడు మణికంఠేశ్వర రెడ్డి వివాహ వేడుకలకు ఎమ్మెల్సీ భూమి రెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి సతీమణి ఉమాదేవి హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా నూతన వధూవరులను నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వివాహ బంధం నిండు నూరేళ్ల బంధం అని తెలియజేస్తూ ఆశీర్వదించారు అనంతరం వివా వేడుక లలో ఉమాదేవితో పలువురు ఆప్యాయంగా పలకరించి వారితో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో వివాహ బంధుమిత్రులు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# గూగుల్ మీట్ ద్వారా ఒక్కరోజు శిక్షణ

## సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ

బద్వేర్ మేజర్ న్యూస్ స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయము నందుసహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు ఆధ్వర్యంలోమధ్యాహ్నం గూగుల్ మీ టు ద్వారా3 గంటల నుండి సాయంత్రం నాలుగు గంట ల వరకు మండల వ్యవ సాయ అధి కారులు మరియు 33 మంది రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు తో గూగుల్ మీట్ ద్వారా సమీక్ష మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు అధికారి తెలిపారు. ప్రభుత్వాలువ్యవసాయ శాఖ అమలు చేస్తున్న పథకాలు, ప్రయోజనాలు, విస్తరణ కార్యక్రమాలు ఈ పంట సోషల్ ఆడిట్, ప్రకృతి వ్యవసాయం, రైతుల విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ, పీఎంకిసాన్ ప్రయోజనాలు, 365 రోజులు పంటలు సాగు, వివిధ పంటలలో ఆశించిన తెగుళ్ళ, పురుగులు నివారణకు చేపట్టాల్సిన సస్య రక్షణ చర్యలు, భూమి లోపలి పొరల్లో జీవ వైవిధ్య సంరక్షణ, రసాయనిక ఎరువులు అందుబాటులో వుంచడం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. వీటి నివారణ కొరకై సిబ్బందికీ అవగాహణ కల్పించారు. క్షేత్ర స్థాయి సమస్యలు గురించి తెలుసుకోవడం జరిగింది. కార్యాలయానందు సిబ్బందిరికార్డ్స్ సక్రమ నిర్వహణ,డ్రిప్ సౌకర్యం, వ్యక్తి గత వ్యవసాయ పనిముట్లు 50 శాతం సబ్సిడీ పై పంపిణీ ,వాటర్ కార్రియింగ్ పైప్స్,రబీలో సాగు విస్తీర్ణం, వేసవిలో



సాగయ్యే పంటల విస్తీర్ణం , నాన్ ఈ పంట డేటా మొదలైన అంశాల పై సమీక్షి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయపు సిబ్బంది, సాంకేతిక వ్యవసాయ అధికారిణి బి. మాధురి పాల్గొన్నారు.

# నేటి విద్యార్థులే రేపటి పౌరులు

## 10వ తరగతి వీడ్కోలు సమావేశంలో ప్రధానోపాధ్యాయులు



వేంపల్లి మేజర్ న్యూస్ :నేటి విద్యార్థులే రేపటి పౌరులని మండల విద్యాశాఖ అధికారి 2 వెంకట రవి కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మహాదేవపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చక్రాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వీడ్కోలు సమావేశం ఆయా కళాశాల ప్రధానోపాధ్యాయులు రామాంజులు, రవికుమార్ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. తోలుతుగా పదవ తరగతి హాల్ టికెట్లను సరస్వతి చిత్రపటం వద్ద పెట్టి ప్రత్యేక పూజలు ప్రధాని అర్చకులు మారుతి వరప్రసాద్ స్వాములసే పూజలు చేయించారు. అనంతరం పలువురు అలరించే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా కళాశాల బృందము విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# వైవియూ విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయిలో నిలవాలి

## మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్

వైవియూ పెండ్లిమర్రి మేజర్ న్యూస్ యోగి వేమన విశ్వవిద్యాలయ 19వ వ్యవస్థాపక దినోత్సవం కళాశాల ఉత్సవం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయ ప్రాంగణం లో బుధవారం అతిథుల జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభ మైంది. ముఖ్యఅతిథిగా హాజరైన రాజంపేట స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతరం శ్రమించాలన్నారు. చరిత్రలో మీకో పేజీ ఉండేలా మీ ప్రణాళికలు ఉండా లన్నారు. ఆకాశంలో ఎగిరే గాలిపటం మీరైతే దానికి ఉన్న దారం మీ తల్లిదండ్రులని దిశా నిర్దేశం చేస్తూ మిమ్మల్ని కాపాడుకుంటూ ఉంటారనే విషయాన్ని నిత్యం గుర్తుంచుకోవాలన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ఆచార్య యస్. రఘునాథ రెడ్డి ప్రారంభ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ విశ్వ విద్యాలయాల వార్షిక నివేదికను నివేదించారు. విద్య పరిశోధనలో విశ్వ విద్యాలయంలో అద్వితీయమైన ప్రగతిని సాధించిం దన్నారు. ప్రస్తుతం రెండో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు విశ్వవిద్యాలయంలో ఉన్న ఏడాదిన్నర కాలం ప్రణాళిక బద్ధమైన ప్రిపరేషన్తో పరిశోధకులుగానూ, పోటీ పరీక్షల్లోనూ రాణించి ఉన్నత అధికారులుగా, పారిశ్రామికవేత్తలుగా స్థిరపడాలని ఉద్బోధించారు. ఇన్ ఛార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఈ ఏడాదిలో




56 మంది స్కాలర్లకు పీహెచ్డీ అవార్డులు ఇచ్చామన్నారు. పరిశోధన సమన్వయం, విద్యార్థుల అవకాశాలు కల్పించడంలో భాగంగా 8 ప్రముఖ సంస్థలతో ఎం.ఓ.యు. కుదుర్చుకున్నామని తెలిపారు. ప్రొద్దుటూరు వైవియు వైయస్సార్ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రొఫెసర్ జయరామిరెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రగతిని వివరించారు. విద్యార్థి దశలో కష్టాలను అలవాటు చేసుకుంటే భవిష్యత్తులో సుఖంగా జీవిస్తారన్నారు. ప్రస్తుత అవసరాలను తీర్చేలా ఇంజనీరింగ్ విద్యలో కరిక్యులం మార్పులు చేశామన్నారు.అనంతరం వై.వి.యు.ఉపకులపతి ఆచా ర్య పి. ప్రకాష్ బాబు పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. దేశంలో అత్యున్నత విద్యాసంస్థగా అభివృద్ధి చెందగల అన్ని అవకాశాలు వనరులు విశ్వవిద్యాలయానికి ఉన్నాయని తెలిపారు. తెలుగుశాఖ ఆచార్యులు ఎన్ ఈశ్వర్‌రెడ్డి సభా సమన్వయం చేశారు. విశ్వవిద్యా లయ పాలక మండలి సభ్యులు ఆచార్య చంద్రమతి శంకర్, డా. ప్రశాంతి మాదక్క, పి.ముజీనా బేగం, పలు విభాగాల డీన్‌లు ఆచార్య కంకణాల గంగయ్య, ఆచార్య రమాదేవి, ఆచార్య ఎ.జి. దాము, ఆచార్య వై.సుబ్బ రాయుడు, ఆచార్య చంద్రఓబుల రెడ్డి, అధ్యాపకులు పాల్గొని అతిథులతోపాటు పలు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అప్లైడ్ మ్యాథమెటిక్స్ సహ ఆచార్యులు డాక్టర్ సునీత ముఖ్య అతిథిని పరిచయం చేయగా, డాక్టర్ అను ప్రసన్న ముగింపు వచనాలు పలికారు. తెలుగు శాఖ స్కాలర్లు కవిత, భైరవ, విద్యార్థులు వి. విజయలక్ష్మి, ఎన్.కళ్యాణి వేమన పద్యాలతో ప్రముఖుల ఆదర్శనీయమైన వచనాలతో సభా ప్రారంభంలో వ్యాఖ్యానించి ఆకట్టుకున్నారు. అనం తరం ఆచార్య విజయభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను ఉర్రూతలూగించాయి. కార్యక్రమంలో వివిధ కమిటీల కన్వీనర్లు, సభ్యులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు సేవ కేంద్రంలో ఈ పంట నమోదు జాబితా విడుదల



లింగాల మేజర్ న్యూస్ : లింగాల మండలంలోని మంగళవారం ఇప్పట్ల రైతు సేవ కేంద్రాలలో రబీ 2024-25 ఈ పంట నమోదు జాబితాను సామాజిక తనిఖీ గ్రామసభ బాగా నిర్వహించామని అన్నారు. అందులో భాగంగా ఇప్పట్ల రైతు సేవా కేంద్రంలో జరగుతున్న పంట నమోదు జాబితా, గ్రామ సభలో ఏఈఓ, హరి శిల్ప, మాట్లాడుతూ ఇప్పట్ల రైతు సేవా కేంద్రం సంబంధించి ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలో ఈ పంట నమోదు రబీ 2024-25 కి సంబంధించి పూర్తి అయినది అని, సామాజిక తనిఖీ కోసం ఈ పంట అర్హుల జాబితాను అన్ని రైతు సేవ కేంద్రల వద్ద ప్రదర్శిస్తునామాని ఈ జాబితాల పై రైతుల నుంచి అభ్యంతరాల స్వీకరణ కోసం రైతు సేవ కేంద్రాలలో గ్రామ సభలు నిర్వహిస్తునామాని తెలిపారు. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు వారి వివరాలు అనగా రైతుల పేర్లు ,సర్వే నెంబర్లను,విస్తీర్ణం,పంట సాగు పద్ధతి తదితర వివరాలు నమోదులో ఎక్కడైనా పొరపాటు జరిగి ఉంటే వాటిని సరిచేసుకోవాలని,అభ్యంతరాలు ఏవైనా ఉంటే వ్రాత పూర్వకంగా ఈ నెల 18వ తేది లోపు తెలియచేయాలని తెలిపారు. అభ్యంతరాలను సరిచూసి 22వ తేదీ లోపు పరిష్కరిస్తామని తెలియచేసారు. అభ్యంతరాలను పరిష్కరించిన అనంతరం ఈ నెల మార్చి 22 వ తేదీన తుది జాబితాను రైతుసేవ కేంద్రాలలో ప్రదర్శిస్తామని తెలి పారు. వీఆర్వో, హరినాథ్ మాట్లాడుతూ తుది జాబితా ఆధారంగానే పంట నష్ట పరిహారం, పంటల భీమా సున్నా వడ్డీ పంట రుణాలు వంటి వాటికీ అర్హత పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వీఆర్ఏలు, జయ శంకర్, నాగభూషణం,గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన సదస్సు




కలసపాడు మేజర్ న్యూస్: మండలంలోని రాజు పాలెం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుదవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఇటీవల ప్రభుత్వం ఆదేశాల మేరకు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కలసపాడు మండల వ్యవసాయ అధికారి జాకీర్ షరీఫ్ మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ గురించి రైతులకు తెలియచేయడం జరిగిందని. ఇప్పటివరకు 4789 మంది రైతులకు రైతు సేవ కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేయడం జరిగిందని ఆయన వివరించారు..2024 ఏడాదికి రబీ ఈ పంట జాబితా రైతు సేవా కేంద్రాల నందు సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించడం జరిగిందని వివరించారు. అన్ని రైతు సేవ కేంద్రాల నందు ఈ పంట గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుంది. 2025 ఖరీఫ్ నకు అవసరమైన జీలుగలు, జనుముల వివరములు తెలుపడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శివ, రైతులు పాల్గొనడం జరిగింది.

# బాధితులకు సత్వరం న్యాయం చేయండి

## పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ సందర్భంగా ఎస్పీ






రాజుపాళెం,మేజర్ న్యూస్: ఏదైనా సమస్య పై పోలీస్ స్టేషన్ కు బాధితులు ఫిర్యాదు చేయనికి వచ్చినప్పుడు వారికి సత్వర న్యాయం జరిగేలా చూడాలని కడప జిల్లా పోలీస్ సూపర్డెంట్ ఇ.జి. అశోక్ కుమార్ పోలీస్ సిబ్బందికి సూచించారు బుధవారం మండల కేంద్రమైన రాజుపాళెంలోని పోలీస్ స్టేషన్ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు పోలీస్ స్టేషన్ రికార్డులు పరిశీలించి క్రైమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు చిన్న సమస్య అయినా ఫిర్యాదు చేస్తే పెండింగ్ లేకుండా సత్వర పరిష్కారం చేయాలని ఎస్పీ తెలిపారు ఎక్కడైనా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు సమాచారం ఉండాలన్నారు గ్రామాల్లో ఎక్కువగా రైతుల పొలం గట్లు భూమి సమస్యలు ఉంటాయని ఆ సమస్యల వల్ల ఎలాంటి పరిణామాలకైనా దారితీస్తాయని అలాంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండాఏదైనా సమస్యను కోర్టుల ద్వారా పరిష్కరించుకోవచ్చుని సూచించాలన్నారు.పోలీస్ సిబ్బంది ద్వారాప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు ప్రజలు ప్రశాంతంగా జీవించే విధంగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు ఏదైనా ప్రజలు సమస్యలపై జిల్లా కేంద్రానికి రావాల్సిన పని లేకుండా ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోనే సమస్యలు తెలుపుకోవచ్చునని ఆ సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు సలహాలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు డిఎస్పి భావన రూరల్ సీఐ బాల మద్దిలేటి ఎస్ ఐ వెంకటరమణ పాల్గొన్నారు

# సమస్యలు తలెత్తకుండా అధికారులు స్పందించండి

## మున్సిపల్ కమిషనర్ రాముడు



పులివెందుల మేజర్ న్యూస్ పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో సమస్యలు తలెత్తకుండా మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి ప్రజలకు సేవలు అందించాలని మున్సిపల్ కమిషనర్ రాముడు సూచించారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ కమిషనర్ డి.రాముడు ఉదయం ఇస్లామ్ పురంవీదులలో పర్యటించారు. ఇస్లాం పురం నందు నీటి సరఫరా గురించి అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.అవసరమయిన ప్రతి చోటా వీధి దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ డి ఇ,ఏఈ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

# చిరుధాన్యాలతో ఆరోగ్యం

## కృషి రత్న డాక్టర్ ఖాదర్ వలీ



పులివెందుల మేజర్ న్యూస్

చిరుధాన్యాలతో చేసిన ఆహారాన్ని తిందాం ఆరోగ్యంగా ఉందామని కృషి రత్న , పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఖాదరవల్లి అన్నారు. బుధవారం పట్టణంలోని రాణి తోపులో ఉన్న ఈట్ స్ట్రీట్ లో సిరి సంజీవిని ది మినిట్స్ కేఫ్ లో ఆయన చిరుధాన్యాలతో చేసిన అల్ప ఆహారాన్ని ఆయన అరిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరి సంజీవినితో చేసిన ఆహారాన్ని తింటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. బీపీ షుగర్ లాంటి సమస్యలు దరిచేరమన్నారు. రోజు ఒక కప్పు చిరుధాన్యాలతో చేసిన ఆహారాన్ని తినడం వలన వ్యాధులు దరిచేర ఉన్నారు.

# అన్న సత్రం పునర్మిస్తామని ప్రకటించడం హర్షనీయం

## ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య



బద్వేల్ టౌన్ మేజర్ న్యూస్ ఇటీవల అటవీశాఖ అధికారులు కాశీనాయన అన్నదాన సత్రం కూల్చివేతను ఖండిస్తూ సొంత నిధులతో సత్రం పునర్నిర్మాణం చేపిస్తానని మంత్రి లోకేశ్ ప్రకటించటంపై విలేకరుల సమావేశంలో హర్షం వ్యక్తం చేశారు, ఆర్యవైశ్య కార్పోరేషన్ డైరెక్టర్ పరిటాల వేంకట సుబ్బయ్య. అటవీ నిబంధనల పేరుతో బద్వేలు నియోజక వర్గంలోని కాశీ నాయన అన్నదాన సత్రాన్ని కూల్చివేయడం బాధాకరం అని భక్తుల మనో భావాలు గౌరవించి.. కూల్చకుండా ఉండాల్సిం దని లోకేష్ స్పందించటం భక్తుల పట్ల లోకేష్ కు గల నిబద్ధతకు నిదర్శనం అని వేంకట సుబ్బయ్య తెలియజేశారు. అన్నదాన సత్రం కూల్చివేసిన అధికారులపై చర్యలకు ఆదేశించినందుకు, సొంత నిధులతో అదే స్థలంలో అన్నదాన సత్రం పునర్ని ర్మాణానికి ముందుకొచ్చినందుకు మంత్రి లోకేష్ కు పరిటాల వేంకట సుబ్బయ్య ధన్యవాదాలు తెలిపారు.

# రేషన్ బియ్యాన్ని ప్రజలందరికి పంపిణీ చేయాలి

## తహశీల్దార్ హరినాథ్ రెడ్డి



వేంపల్లె మేజర్ న్యూస్:రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రజలందరికి పంపిణీ చేయాలని తహశీల్దార్ హరినాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చింతలమడుగు పల్లెలో ఉన్న రేషన్ షాపును తాహసిల్దారు హరినాథ్ రెడ్డి తనిఖీ చేశారు. అలాగే స్టాక్ వివరాలను డీలర్లు లైనా అరుణ, మహేష్ లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెల 1 వ తేది నుండి 17 వరకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని కోరారు. స్టాక్ పెట్టుకొని కూడ బియ్యం పంపిణీ చేయక పోతే అలాంటి డీలర్లుపై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. బియ్యం కోసం అనేక మంది పిర్యాదులు చేస్తున్నారని అలాంటి పిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత డీలర్లుదే అన్నారు. స్టాక్ పూర్తిగా అయి పోయింతా వరకు బియ్యం పంపిణీ చేయాలని చెప్పారు. గౌడన్ ల్లో తూకాలు తక్కువ రావడం వలన నష్టం జరగు తున్నదని డీలర్లు తాహసిల్దారు వద్ద వాపోయారు. ఈయన వెంట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడదాం ..!

## బద్వేల్ మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి




బద్వేల్ మేజర్ న్యూస్ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) కడప జిల్లా కమిటీ మాదక ద్రవ్యాల నివారణకై ముద్రించిన పోస్టర్స్‌ను డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నందు బుధవారం మున్సిపల్ కమిషనర్ వి.వి నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగాకమిషనర్ వి.వి నరసింహారెడ్డి మాట్లాడుతూ.... యువత మత్తు,మాధక ద్రవ్యాల వంటి జోలికి వెళ్ళవద్దని డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు పాటుపడి ముఖ్యంగా యువత మత్తు పదార్థం లాంటి రెం డ్రగ్స్ కు వాటికి దూరంగా ఉండాలన్నారు. యువత ఇటువంటి వాటి మోజులో పడి చెడు వ్యసనాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని,ఇప్పటికే జిల్లాలో గంజాయి మత్తుపదార్థాల వంటి వాటిని అరికట్టడానికి పోలీస్ యంత్రాంగం ఉక్కు పాదం మోపారని, యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా మంచి మార్గంలో నడిచి మంచి భవిష్యత్ వైపు అడుగులు వేయాలని, డ్రగ్స్ రహిత జిల్లాగా నిర్మిద్దామని యువత డ్రగ్స్ రహిత ఉద్యమంలో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.డ్రగ్స్ నివారణకై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ యువజన సంఘానికి నాయకత్వానికి అభినం దనలు తెలియజేస్తూ ఇటువంటి మత్తు పదార్థాల వంటివి అమ్మిన వారిపై కఠిన శిక్ష అమలు చేయబడునని అన్నారు. యువత తమ ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని ఆ మాయలో పడవద్దని యువతకు హితువు పలికారు. యువతకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించి యువతను చైతన్యవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్య క్షులు చిన్ని మాట్లాడుతూ... యువతను డ్రగ్స్ మత్తు పదార్థాల వంటి చెడు వ్యసనాల వైపు నుండి మంచి మార్గం వైపు నడపడం కోసం డివైఎఫ్ఐ యువజన సంఘం అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని అన్నారు రాష్ట్రంలో డ్రగ్స్ గంజాయి వంటి వాటికి యువత అలవాటు పడి నిండు జీవితాన్ని భావితరాల యువత నాశనం చేసుకుంటున్నారు యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తే ఇటువంటి వాటిపైకి ఆలోచన ఉండదన్నారు ప్రధానంగా నిరు ద్యోగం సమస్యతో యువత వలసలు పోతున్నారని మరికొందరు మొబైల్స్‌లో పబ్జి ఒంటికి బానిస అవడం మరికొందరు మత్తు పదార్థా లకు బానిసవుతున్నారు అన్నారు ఇది ఎక్కువగా ఈ మధ్యకాలంలో చదువుకుంటున్న విద్యాసంస్థల కేంద్రాలుగా డ్రగ్స్ గంజాయి వంటివి నడుస్తున్నాయన్నారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ లాంటి ఒక భారీ పరిశ్రమ వచ్చి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తే ఈ ప్రాంతం అభివృద్ధితోపాటు యువత చెడు వ్యసనాల వంటివి వైపు వెళ్లకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సి.సి ముద్దుకృష్ణ డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ ఆదిల్ బాషా, పట్టణ నాయకులు కె. రామకృష్ణ, ప్రసాద్ రెడ్డి, రాజు, మనోహర్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## వద్దిరాల జడ్పీ హై స్కూల్ లో ఘనంగా తెలుగు టీచర్ కృష్ణయ్య పదవి విరమణ సన్మాన మహోత్సవం



**జమ్మలమడుగు (మైలవరం), మేజర్‌న్యూస్:** మైలవరం మండల పరిధిలోని వద్దిరాల జిల్లా పరిషత్ హై స్కూల్ నందు తెలుగు టీచర్ గా శ్రీ సింగనమోని కృష్ణయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం జిల్లా పరిషత్ హై స్కూల్ నందు సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో మైలవరం ఎంఈఓ చిట్టిబాబు, స్కూల్ చైర్మన్ కొర్ర పాటి హరి రాయల్, స్కూల్ హెడ్మాస్టర్ రంగేశ్వర్ రెడ్డి, హైస్కూల్ స్థల దాత సింగన పల్లె చంద్రశేఖర్ రెడ్డి, వద్దిరాల సర్పంచ్ వేంపలాకు జయశ్రీ ముద్దనూరు మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకటకృష్ణారెడ్డి ,మాజీ జెడ్పిటిసి అల్లే చిన్న చెన్నా రెడ్డి, సీనియర్ న్యాయవాది వేంపలాకుసూర్య పెద్దిరాజు యాదవ్,ధన్నవాడ అన్నే బోయిన కొండయ్య యాదవ్,సింగనపల్లె నీలకంఠ రెడ్డి,రిటైర్డ్ హిందీ పండితులు బికారి సాహెబ్ మరియు మండల వ్యాప్తంగా వివిధ స్కూల్లో నుండి టీచర్స్ కృష్ణయ్య ను సన్మానించారు. ఆయన భవిష్యత్తులో మరింత సంతోషంగా ఆనందంగా ఉండాలని కోరుకున్నారు.విద్యార్థిని, విద్యార్థులు, బోధన సిబ్బంది, భోదనేతర సిబ్బంది,పాల్గొన్నారు. సన్మానసభ తదనంతరం ఈకార్యక్రమానికి విచ్చేసిన అందరికీ భోజన సదుపాయాలు కల్పించారు.

## సొంత నిధులతో అన్నదాన సత్రం నిర్మించడం హర్షనీయం

### మంచూరి సూర్యనారాయణ రెడ్డి



**అట్లూరు, మేజర్‌న్యూస్:** కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గంలోని కాశినాయన అన్నదాన సత్రం కూల్చివేతపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించడం పై బద్వేల్ నియోజకవర్గ టిడిపి నాయకుడు మంచూరి సూర్యనారాయణ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు ఉన్న కూడా భక్తుల మనోభావాలను గౌరవించి కూల్చకుండా ఉండాల్సిందని కూల్చివేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామని త్వరలోనే నా సొంత నిధులతో కూల్చివేసిన చోటే అన్నదాన సత్రాన్ని పునర్నిర్మిస్తానని తెలపడంతో బద్వేల్ నియోజకవర్గ వ్యాప్తంగానే కాకుండా తెలంగాణ కర్ణాటక నుండి వచ్చే భక్తుల మనోభావాలను గౌరవించి నిర్ణయం తీసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## గంజాయి సేవించే వారిపై.. డ్రోన్ కెమెరాలతో నిఘా



**కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్ :** గంజాయి, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్పీ ఇ.జి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు కడప నగరం, శివారులో గంజాయి సేవనం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా ఉంచేలా చర్యలు చేపట్టారు. ఆయా ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. అనుమానస్పదంగా సంచరించే వారిపై నిఘా ఉంచడం తో పాటు గంజాయి ని సేవించే వారిని గుర్తించేందుకు విస్తృత చర్యలు చేపట్టారు. బుధవారం నగరంలోని గుర్రాలగడ్డ, అల్మాస్ పేట బ్రిడ్జి, బుగ్గవంక పరివాహక ప్రాంతం, ఏ.ఎస్.ఆర్ నగర్ పరిసర ప్రాంతాలు, పులివెందుల రోడ్ లోని సాక్షి సర్కిల్ పరిసరాలలో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం ద్వారా అనుమానాస్పదంగా సంచరించే వారిని గుర్తించే చర్యలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులను క్షుణ్ణంగా విచారిస్తున్నారు. ఫ్యాక్షన్ జోన్ ఇన్స్పెక్టర్ రమణారెడ్డి, ఎస్.ఐ మల్లికార్జున రెడ్డి, స్పెషల్ పార్టీ సిబ్బంది, డ్రోన్ ఆపరేటర్ పాల్గొన్నారు.

# పవన్‌ది డ్రామా... లోకేష్‌ది కపట నాటకం..!

**కాశీనాయన ఆశ్రమం కూల్చివేత... కూటమి ప్రభుత్వం హైందవ ధర్మ వ్యతిరేకి..! - కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ఆశ్రమంపై కుట్ర**

**- సనాతన ధర్మం పేరుతో పవన్ డ్రామాలు - క్షమాపణ పేరుతో లోకేష్ రాజకీయ నాటకం**

**- కూటమి ప్రభుత్వం కేంద్ర అధికారులతో మాట్లాడి ఆశ్రమం కార్యక్రమాలు కొనసాగించాలి - బీసీవై జాతీయ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ డిమాండ్**

**బద్వేల్, మేజర్‌న్యూస్ :** కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గంలోని కాశీనాయన ఆశ్రమం కూల్చివేత హైందవ ధర్మాన్ని అణిచివేసే కూటమి ప్రభుత్వ కుట్రలో భాగం అని బీసీవై పార్టీ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ రోజు ఆ ఆశ్రమాన్ని సందర్శించిన రామచంద్ర యాదవ్ ఆశ్రమంలో అధికారులు బలవంతంగా కూల్చేసిన ఆశ్రమానికి సంబంధించిన కట్టడాలు, అన్నదాన సత్రము, గోశాల, వసతి సదుపాయాలు, కళ్యాణకట్టను సందర్శించిన తర్వాత మీడియాతో మాట్లాడారు. ఈ శ్రమంలో గత 28 సంవత్సరాల నుంచి అనేక అనేక ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి.. సుమారు చుట్టుపక్కలున్న నాలుగైదు ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన భక్తులు ఈ ఆశ్రమానికి లక్షల్లో వస్తుంటారు.. 24 గంటల పాటు ఈ ఆశ్రమం అన్నదానానికి ఎంతో ప్రసిద్ధి అని... నిత్యం ఎన్నో వందలు, వేల మంది వచ్చినా... ఇక్కడ అన్నం లేదు అన్నది లేకుండా గత 28 ఏళ్లుగా అన్నదానం చేస్తున్నారని తెలిపారు. ఎన్నో ఆరాధన కార్యక్రమాలతో పాటు, వేల మంది అనాథలు ఎంత మంది వచ్చినా ఆశ్రయం కల్పించి మరీ అన్నదానం చేస్తుంటారని అతిపెద్ద గోశాలలో వందల గోవులను పోషిస్తున్నారని...ఇన్ని మంచి కార్యక్రమాలు జరుగుతుంటే.. ఈ ఆశ్రమానికి భక్తులను రానివ్వకుండా అడ్డుకోవడానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్నో కుట్రలు జరుగుతున్నాయని రామచంద్ర యాదవ్ మండిపడ్డారు. గతేడాది ఆగస్టు నెల నుంచి ఈ ఆశ్రమానికి అప్పటి వరకు ఉన్న ఆర్టీసీ బస్సు సౌకర్యం ఆపేసి భక్తులను అడ్డుకున్నారు.. ఆ తర్వాత విద్యుత్ శాఖ అధికారులను ప్రయోగించి విద్యుత్ నిలిపి వేస్తామని బెదిరించారు. ఆ తర్వాత అటవీ శాఖ అధికారులు కట్టడాలు కూల్చి వేస్తున్నామని బలవంతంగా ఆశ్రమాన్ని కూల్చివేశారని వాపోయారు. ఇక్కడ గత 28 సంవత్సరాల నుంచి ఎన్నో నిర్మాణాలు జరిగాయి. అటవీశాఖ అధికారులు కూల్చివేసిన కట్టడాల్లో ఎంపీ ల్యాడ్స్ నిధులతో కట్టి అధికారిక లాంఛనాలతో ప్రారంభించినవి కూడా ఉన్నాయి... అవి నిర్మాణాలు జరుగుతున్నప్పుడు అటవీ శాఖాధికారులకు ఇది అటవీ భూమి అన్నది తెలియలేదా? అని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ ఈ భూమి నిజంగానే అటవీ శాఖకు సంబంధించింది అయితే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు... స్వామి ఆశ్రమ ఈ భూమికి ఒకటికి నాలుగురెట్లు భూమి అంటే... సుమారు 25 ఎకరాలలో ఈ ఆశ్రమం ఉంటే.. 100 ఎకరాలు కూడా ఇవ్వడానికి అటవీశాఖ ప్రాంతానికి .. 100 ఎకరాలు ఇచ్చేందుకు సిద్ధపడ్డారని.. ఒకవేళ అలా కానిపక్షంలో ఈ ఆశ్రమంలో ఉన్న భూముల విలువకు రెండింతలు డబ్బులు ఇచ్చేందుకు కూడా సిద్ధపడినా కావాలనే ఆశ్రమాన్ని కూల్చివేసే దుర్మార్గపు చర్యలు చేపట్టారని రామచంద్ర యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు స్పందించి ఈ చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంలో ప్రధాన భాగస్వామిగా ఉన్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం పేరు చెప్పి బాప్టిజం స్వీకరించి సనాతన ధర్మ రక్షకుడు అని చెప్పుకుంటున్నా ఇలాంటి చర్యలు ఆయనకు కనపడడం లేదా అని ప్రశ్నించారు. పవన్ బయట రాష్ట్రాలలో దేవాలయాలు సందర్శిస్తూ సనాతన ధర్మ పరిరక్షకుడిని అని ప్రచారం చేసుకుంటూ రాష్ట్రంలో దేవాలయాలు కూల్చివేస్తున్నా ఆశ్రమాలు కూల్చివేస్తున్నా ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. దేవాలయాలకు సంబంధించిన ఉత్సవాలు జరుగుతుంటే... వేరే వర్గం వాళ్లు అడ్డుకుని ఇబ్బందులు పెడుతూ.. బాధితుల పైన తప్పుడు కేసులు పెడుతూ జైళ్లు పాలు చేస్తుంటే నోరు మెదపని పవన్ కళ్యాణ్ ఈ ఆశ్రమానికి సంబంధించిన ప్రధానమైన అటవీశాఖ తన ఆధీనంలో ఉన్నా ఇప్పటి వరకు నోరు మెదపకపోవడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ అనే వ్యక్తి సినిమాలలో నటిస్తున్నాడు.. రాజకీయాల్లో నటిస్తున్నాడు.. కానీ సనాతన ధర్మం పేరు చెప్పి... ఇలాంటి నాటకాలు ఆడితే మాత్రం ప్రజలు క్షమించరని.. హైందవజాతి క్షమించదని.. ఇలాంటి డ్రామాలు ఆడడం మానుకుని ఇప్పటకి అయినా జరిగిన తప్పులు దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్టు రామచంద్ర యాదవ్ తెలిపారు. ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి నారా లోకేష్ ఆశ్రమం కూల్చివేత విషయంలో ఇచ్చిన స్టేట్‌మెంట్ కూడా కేవలం సానుభూతి పొందే స్టేట్‌మెంట్ అని... అధికారులు తెలియకుండా తప్పు చేశారని.అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పి తప్పు కప్పిపుచ్చుకోవడం చాలా హేయమైన చర్య అన్నారు. కేవలం ఇక్కడ భక్తుల్లో ఆగ్రహావేశాలు.. ఈ ప్రాంత ప్రజల్లో కోపాన్ని చల్లార్చడానికి లోకేష్ రాజకీయ నాటకం ఆడారే తప్పా ఇందులో పశ్చాత్తాపం లేదన్నారు. నిజంగా లోకేష్‌కు చిత్తశుద్ధి ఉంటే ఇక్కడ జరిగిన తప్పులను సవరించుకుని వెంటనే ఇక్కడ కార్యక్రమాలు యధావిధిగా జరిగేలా కేంద్ర అటవీశాఖ అధికారులతో మాట్లాడి వీటిని పునురుద్ధరించాలని బీసీవై పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని ఆయన తెలిపారు.



## ఘనంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు - మాజీ ప్రభుత్వ సలహాదారుడు నాగార్జున రెడ్డి**

**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు మాజీ ప్రభుత్వం సలహాదారుడు నాగార్జున రెడ్డి పోరుమామిళ్లలోని తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో యువత పోరు పేరుతో కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు వేలాదిగా పాల్గొన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు దేశంలోనే ఫీజు రియంబర్స్‌మెంట్ తీసుకొచ్చి ఆర్థికంగా వెనకబడ్డ అన్ని కులాల వారికి వర్తించేటట్లు చేశారు. డాక్టర్లు, ఇంజనీర్లు, పీజీ చేసేవారికి ప్రతి ఒక్కరికి ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వడం జరిగింది అన్నారు. అనంతరం జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఐదు సంవత్సరాలలో ఫీజు రియంబర్స్ మెంట్, అమ్మబడి ప్రతి ఒక్కరికి ఇచ్చి, చెప్పిన హామీలను నెరవేర్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికె చెల్లుతుందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని అన్నారు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, నిరుద్యోగ భృతి రూ.3000లు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదన్నారు. రైతులు వ్యవసాయ గిట్టుబాటు ధర లేక బాధపడుతున్నారని, అలాగే విద్యారంగం పూర్తిగా నాశనం అయిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వారికి అప్పచెప్పేదానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, రాష్ట్రానికి వచ్చిన మెడికల్ సీట్లను కూడా వెనక్కి ఇవ్వడం దారుణమన్నారు. ప్రజలు తగిన సమయంలో కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని ఆయన తెలిపారు.



## వ్యక్తిగత, విద్యా సామర్థ్యం పెంచుకోవాలి

### యోగివేమన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా.కె.లలిత

**వేంపల్లె మేజర్ న్యూస్:** విద్యార్థులు తమ వ్యక్తిగత, విద్యా పరమైన సామర్థ్యాన్ని పెంచుకోవాలని యోగి వేమన విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కె.లలిత పేర్కొన్నారు. బుధవారం ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో పలు అంశాలపై సైకలాజికల్ కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని, సాధించే దిశగా కృషి చేయాలన్నారు. శారీరక, మానసిక దృఢత్వం కోసం బలమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అలాగే విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యం చేసుకోవాలని, తార్కిక ఆలోచనతో ఒక పద్ధతి ప్రక్రియ ద్వారా చదవాలన్నారు. స్వియ క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపోదించు కోవాలన్నారు. యోగ సాధన, తదితర వ్యాయామ ప్రక్రియ వల్ల మానసిక ప్రశాంతత



లభిస్తుందన్నారు. డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలనాధికారి రవికుమార్, వెంకటేష్, శరవణ్, దీపిక తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.